సాక్షి వరంగల్

మంగళవారం | 23 | జూలై | 2024



ప్రాణహిత ఉగ్రరూపం.. - 8లో▸

మహారాష్ట్రలో వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చింది. కాళేశ్వరం పుష్కరఘాట్‌పై నుంచి వరద నీరు 12.500 మీటర్ల ఎత్తులో దిగువకు తరలిపోతుంది.



తెలంగాణ అంటేనే దాశరథి..

తెలంగాణ అంటేనే దాశరథి అని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలో దాశరథి శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



నర్సంపేట: నర్సంపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వికాస తరంగిణి నర్సంపేట శాఖ వరంగల్ జిల్లా ప్రజ్ఞ సంస్కార విభాగం, పాఠశాల ఉపాధ్యాయ బృందం సమక్షంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి (వీటీ) అధ్యక్షుడు, తెలుగు పండితుడు కృష్ణారావు మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. వీటీ కార్యదర్శి రంగనాథస్వామి డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ రూ.3వేల నగదును ముగ్గురు చొప్పున ఆరుగురికి రెండు విభాగాల్లో ప్రశంసపత్రాలు ఆగస్టు 15న అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సారయ్య, అధ్యాపకులు భిక్షపతి, శిరీష, కావ్య, ఉమామహేశ్వర్, వీటీ మహిళలు రేణుక, త్రివేణి, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల విద్యార్థినులకు అస్వస్థత



నర్సంపేట: నర్సంపేట పట్టణం ద్వారకపేటలోని తెలంగాణ మైనార్టీ గురుకులం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు జాస్మిన్, ఆఫ్రిన్‌లకు సోమవారం తీవ్ర నొప్పి రావడంతో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తొలుత ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులకు నొప్పి రావడం జరిగిందని సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే నర్సంపేట జిల్లా ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ శంకర్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో జాస్మిన్‌కు జ్వరం, తలనొప్పి, ఆఫ్రిన్‌కు కిడ్నీలో రాళ్లతో నొప్పి వచ్చిందని, ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని వైద్యులు ధృవీకరించారు.

ఆశ వర్కర్ల వేతనం పెంచాలి




కాశోజీ సెంటర్: ఆశవర్కర్స్ సమస్యలను పరిష్కరించి ఫిక్స్ వేతనం నెలకు రూ.18 వేలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్స్ బాధ్యులు వి.వజ్రమ్మ, సీహెచ్.రాణి, జి.రాజేశ్వరి, బి.సునీత, ఎం.పద్మ, సీఐటీయూ నాయకుడు ముక్కెర రామస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశవర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ప్రతీ నెల 2వ తేదీ నాటికి తమకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇవ్వాలని, ఆశలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవిను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వనమాల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో..

పెండింగ్ స్కాలర్‌షిప్స్, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. అలాగే గురుకులాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మచ్చ పవన్ కళ్యాణ్, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, రాజేందర్, ప్రమోద్, రఘు, శ్రీకాంత్ వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బదిలీ

కాశోజీ సెంటర్: జిల్లాలో వివిధ శాఖలో పనిచేసిన ముగ్గురు బదిలీ అయ్యారు. ఇందులో జిల్లా పరిశ్రమ శాఖ అధికారి నర్సింహమూర్తి ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీ బోర్డ్‌కు, మత్స్య శాఖ అధికారి నరేష్‌కుమార్ నాయుడు పెద్దపల్లికి, అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.



ఓరు ‘ఘల్లు’మనే..నా!?

పార్లమెంట్‌లో నేడు కేంద్ర బడ్జెట్.. ఆశగా ఎదురుచూపు..

- లోక్‌సభ ఎన్నికల్లో ఓరుగల్లుపై హామీల జల్లు
- పోటీపడిన అధికార, ప్రతిపక్ష పార్టీలు.. ఈ బడ్జెట్‌లోనైనా వాటా దక్కేనా?
- మరోసారి ప్రతిపాదనలు ఇచ్చిన ఉమ్మడి జిల్లా ఎంపీలు
- కాజీపేట కేంద్రంగా ఎన్నో రైల్వేలైన్లు.. ప్రతిపాదనలకే పరిమితం...
- స్మార్ట్ సిటీ, హృదయ్ పథకాలకు గత బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యం...
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, మేడారం జాతరకు జాతీయ హోదాపై ఆశలు

సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓరుగల్లు టార్గెట్‌గా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ హోరాహోరీగా ప్రచారం సాగించాయి. ప్రధానంగా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలో రెండో అతి పెద్ద నగరం వరంగల్‌పై దృష్టి పెట్టాయి. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను ప్రభావితం చేసేందుకు కూడా ఓరుగల్లునే సెంటర్ పాయింట్ చేసుకుని ఉధృతంగా ప్రచారాన్ని సాగించాయి. ఈ సందర్భంగా పోటాపోటీగా హామీల జల్లు కురిపించాయి. ఆ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ.. మంగళవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఈ నేపథ్యంలో ఓరుగల్లు అభివృద్ధికి పార్టీలు ఏ విధంగా పాటుపడతాయన్న చర్చ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే మొదలైంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

ఆశించేవి ఎన్నో.. అవకాశం ఎన్నింటికో..

- నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మహబూబాబాద్ నుంచి విజయవాడకు, జనగామ నుంచి సికింద్రాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక సాధ్యాసాధ్యాలను పరిశీలించి అమలు చేస్తామన్న హామీ కూడా ఇచ్చారు. దీంతో ఈ రెండు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.
- డోర్నకల్ రైల్వే జంక్షన్ నుంచి కొవ్వూరు రైల్వేలైన్ పూర్తి చేసి, ఖమ్మం – భద్రాచలం రోడ్ – డోర్నకల్‌కు లైన్ల అనుసంధానం చేయాలంటున్నారు.
- కాజీపేట నుంచి ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, దక్షిణంలోని చెన్నై, పడమరలోని ముంబయి, తూర్పులోని విశాఖపట్నాలకు వెళ్లడానికి ఇతర స్టేషన్ల నుంచి వచ్చే రైళ్ల మీదే ఆధార పడాల్సి వస్తోంది. గతంలో ఈస్టర్న్ రైల్వే కాజీపేట నుంచి ముంబయికి ఆనంద్‌వన్, తడోబా ఎక్స్‌ప్రెస్‌లను నడిపింది. కరోనా సమయంలో రద్దయిన వీటిని ఇప్పటికీ పునరుద్ధరించలేదు. ప్రస్తుతం కాజీపేట నుంచి పుణె, హడప్సర్ (ముంబయి) వారాంతపు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి.
- ఆధ్యాత్మిక కేంద్రాలైన తిరుపతి, వారణాసి, షిర్డీకి ప్రతీరోజు వందల మంది కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, జనగామ రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్తుంటారు. వీరికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లే ఆధారంగా ఉన్నాయి.

ఎంపీల ప్రతిపాదనలేమిటంటే..



కడియం కావ్య



బలరాం నాయక్

- మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించడంతో పాటు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, స్మార్ట్‌సిటీ, హృదయ్‌లకు భారీగా నిధులు కావాలని పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య ప్రతిపాదించారు. వీటన్నింటిని సమీక్షించి కాజీపేటకు రైల్వే డివి జన్ హోదా కల్పించాలని కోరినట్లు వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్‌లు చెప్పారు.
- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో సైనిక్ స్కూల్ స్థాపన, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిలను ప్రస్తావించారు.

తెరమీదకు అనేక డిమాండ్లు..

కాజీపేట రైల్వే జంక్షన్‌కు డివిజన్ హోదా కలగానే మిగులుతోంది. డివిజన్ హోదా కల్పిస్తే ఇక్కడినుంచే రైళ్లను ప్రారంభించడానికి అవకాశం ఉంటుంది.

- కొత్తగా ఏర్పడిన గుంటూరు రైల్వే డివిజన్‌నుంచి ఢిల్లీ, విశాఖ, ముంబయి, షిర్డీ లాంటి ప్రాంతాలను కలుపుతూ రైళ్లు నడుస్తున్నాయి. ఆ అవకాశం కాజీపేట నుంచి లేకుండా పోతుంది.
- గోవాకు వెళ్లేవారు సికింద్రాబాదుకు వెళ్లి, అక్కడినుంచి అజంతా ఎక్స్‌ప్రెస్ లేదా ఇతర రైళ్లను ఆశ్రయిస్తున్నారు. కశ్మీరు, కేరళ, కన్యాకుమారి తదితర పర్యాటక ప్రాంతాలకు వారాంతపు రైళ్లు మాత్రమే అవి కూడా వరంగల్ మీదుగా ఉన్నాయి.
- గ్రేటర్ వరంగల్‌కు 2016 మే నాలుగో వారంలో సప్లమెంటరీ పోటీల్లో ‘స్మార్ట్‌సిటీ’లో చోటు లభించగా.. రూ.2 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనుల ప్రతిపాదనలున్నా ఆ మేరకు నిధులు కేంద్రం కేటాయించలేదు. స్మార్ట్‌సిటీ, హృదయ్ కింద వరంగల్ నగర అభివృద్ధికి అత్యధికంగా నిధులు ఇవ్వాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: వర్షాకాలం కారణంగా నర్సంపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, మురికి వాడలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. ఈ మేరకు నర్సంపేట మున్సిపాలిటీ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించగా మాధవరెడ్డి పాల్గొని కౌన్సిల్ సభ్యులు తెలిపిన విషయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకుఅతీతంగా చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో 365 రోజులు మంచినీటిని అందించడమే తన సంకల్పమన్నారు. పట్టణ అభివృద్ధికి రూ.40కోట్లతో ప్రతీ డివిజన్‌లో రూ.1.50కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్ పూర్తయిందన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, కమిషనర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని బాలుర హైస్కూల్లో సోమవారం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం హైస్కూల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.విద్యార్థుల అభ్యర్థన మేరకు తాగునీటి కోసం ప్యూరిఫైయర్ మిషన్‌తో పాటు బోరు మోటారు తక్షణమే మంజూరు చేయిస్తున్నట్లు ప్రకటించారు.

ఆకేరు చెక్ డ్యాం పరిశీలన

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం గత సంవత్సరం వరద తాకిడికి కొట్టుకు పోగా సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించి పరిశీలించారు. చెక్ డ్యాం తెగిపోవడంతో ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పట్టణంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ చెక్ డ్యాంను వెంటనే పునఃనిర్మించే విధంగా చూడాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి తక్షణమే చెక్ డ్యాం మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు, నాయకులు మార్నేని వెంకటేశ్వర్‌రావు, జోజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, ఎండీ అప్సర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్ డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కలెక్టరేట్‌లో కంపు కంపు

- పారిశుద్ధ్య లోపంతో ప్రజల ఇబ్బందులు
- పాత సామానుకు రక్షణ కరువు



కలెక్టరేట్ ఆవరణలో నిలిచిన నీరు

కాశోజీ సెంటర్: వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో పారిశుద్ధ్య లోపం కనబడుతుంది. కలెక్టరేట్ ప్రధాన భవనం ఎదుట నామమాత్రంగానే శుభ్రం చేసి మిగతా పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన గేటు ఎదుట చెరువును తలపించే విధంగా నీళ్లు నిలిచినా పట్టించుకునే నాథుడే లేడు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చే ఫిర్యాదుదారులు నిలిచిన నీటితో ఇబ్బందులు పడ్డారు. అలాగే భవనం వెనుకభాగంలో ఉన్న మరుగుదొడ్ల చుట్టూ నీరు నిలవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు అడవిని తలపిస్తున్నాయి. అలాగే కలెక్టరేట్ భవనం వెనక భాగంలో ఉన్న పాత సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోతున్నారు. విశ్రాంతి ప్రాంగణం వెనకాల నుంచి గోడ అవతలికి పడేసి పట్టుకుపోతున్నారు.



పాత సామగ్రిని పట్టుకుపోతున్న గుర్తు తెలియని వ్యక్తి

రుణమాఫీ మాకు వర్తించదా?





కాపులకనపర్తి సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

ఆందోళనలో కాపులకనపర్తి సొసైటీ రైతులు

- మొదటి విడతలో పేర్లు రాకపోవడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- సొసైటీ పరిధిలో 1,907 మంది రైతులు, రూ 15.60 కోట్ల రుణం

సంగెం: మండలంలోని కాపులకనపర్తి సొసైటీ పరిధిలోని రైతులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మాకు వర్తించదా అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సొసైటీ పరిధిలో కాపులకనపర్తి, ఆశాలపల్లి, కాట్రపల్లి, వెంకటాపూర్, గవిచర్ల, రామచంద్రాపురం, లోహిత, పెద్ద తండా, షాపూర్, తీగరాజుపల్లి, సోమ్లాతండాతో పాటుగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామాల పరిధిలో గల 1,907 మంది రైతులు మొత్తం రూ.15.60 కోట్ల రుణం పొంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18న ప్రకటించిన రుణమాఫీ మొదటి విడతలో సొసైటీ పరిధిలోని రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెంది నిత్యం సొసైటీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పాలని అధికారులను వేడుకుంటున్నారు. కాగా సొసైటీ పరిధిలో గతంలో 2,452 మంది రైతులు ఉండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 1,688 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. మిగతా 764 మందికి రుణమాఫీ జరగలేదు. కాపులకనపర్తి సొసైటీ డీసీసీబీ పరిధిలో కాకుండా హనుమకొండలోని ఐఓబీ పరిధిలో ఉండడంతో గత కొన్నేళ్లుగా కొత్త రుణాలు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు రైతులు తమ ఖాతాలను ఉపసంహరించుకుని ఇతర బ్యాంకుల్లో పంట రుణాలు పొందారు. ఇక మిగిలిన 1,907 మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సొసైటీ పరిధిలోని రైతులందరికీ రుణమాఫీ వర్తించి న్యాయం జరిగేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఐఓబీ పరిధిలోని వారికి రుణమాఫీ కాలేదు..

హనుమకొండలోని ఐఓబీ (ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్) పరిధిలో కాపులకనపర్తి, పెగడపల్లి, వంగపహాడ్, వరంగల్ సొసైటీ పరిధిలోని సుమారు 6 వేలకు పైగా ఉన్న రైతులకు ప్రస్తుతం రుణమాఫీ వర్తించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు రుణమాఫీ జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దు.

– రమణాచారి, సీఈఓ కాపులకనపర్తి

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

కాశోజీ సెంటర్: నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, యువకులు ఆవిష్కరణల మీద ఆసక్తి ఉన్న వారు మూడు నిమిషాల వ్యవధిలో వీడియో తీసి 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వారు సెలక్ట్ చేసి ఆగస్టు 15న ప్రదర్శనకు అవకాశం ఇస్తారని, ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ పీడీ కౌసల్య దేవి, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి, అధికారులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం వర్షాలు, వరద ప్రమాదం తగ్గినప్పటికీ ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని బొందివాగు, కొలంబో ఆస్పత్రి ప్రాంతం, చిన్న వడ్డెపల్లి చెరువులో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లు, వంతెనలు తెగిపోయినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్ 18004253434, 18094251980 లకు సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లు మహమ్మద్ ఇక్బాల్, నాగేశ్వరరావు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి
- ప్రజావాణిలో 123 అర్జీలు

కాశోజీ సెంటర్: ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యదేవి, ఇతర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శాఖల వారీగా లీడ్ బ్యాంక్ 6, పంచాయతీ శాఖ 8, గ్రామీణ అభివృద్ధి శాఖ 8, స్త్రీ శిశు సంక్షేమ శాఖ 3, రెవెన్యూ శాఖ 74, ఇతర శాఖలు చెందినవి 24 మొత్తం 123 దరఖాస్తులు వచ్చాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.


బ్యాటరీ వీల్ చైర్ ఇప్పించరూ..



పుట్టుకతోనే దివ్యాంగురాలిని. బ్యాటరీ వీల్ చైర్ ఇప్పించాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా.. పట్టించుకోవడం లేదు. ఇటీవల ఏనుమాముల మార్కెట్‌లో పంపిణీ చేసినప్పుడు కూడా రాలేదు.

– పెదకాస్ కనకలక్ష్మి, లోహిత

కొడుకు చూసుకోవడం లేదు..



నాకున్న నాలుగు ఎకరాల భూమిని నాకు తెలవకుండా నా కుమారుడు తన పేర పట్టా పాస్‌బుక్ చేయించుకున్నాడు. ఇప్పుడు నన్ను ఇంట్లో నుంచి గెంటేసి ఇబ్బందులు పెడుతున్నాడు. అధికారులు ఆదుకోవాలి.

– వేల్పుల నర్సయ్య , గవిచర్ల

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట: రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా రైతుల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. సోమవారం వర్ధన్నపేట డీసీసీబీ శాఖలో వర్ధన్నపేట, రాయపర్తి, కొలన్‌పల్లి సొసైటీ పరిధిలోని గ్రామాల 44 మంది రైతులకు రుణమాఫీ కాగా వారికి రూ.34.20 లక్షల కొత్త పంట రుణాలు మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కోసం రుణమాఫీకి శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ అర్హుడైన రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, అరుణ, రాజేష్ ఖన్నా, రామచంద్రరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, ఎండీ అప్సర్, సత్యనారాయణ, వెంకన్న శ్రీనివాస్, ఎండీ అన్వర్, బ్యాంక్ మేనేజర్ సమత, రైతులు పాల్గొన్నారు. అనంతరం వర్ధన్నపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్లకొండ శ్రీనివాస్ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రవీందర్‌రావు పరామర్శించారు.



పంట రుణాల చెక్కు అందజేస్తున్న రవీందర్‌రావు, ఎమ్మెల్యే నాగరాజు

గిరిజన గురుకుల బాలుర ప్రతిభ కళాశాలల్లో అడ్మిషన్లు

విద్యారణ్యపురి: వరంగల్ యాకూబ్‌పురాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ప్రతిభ కళాశాల, అలాగే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఎంపీసీ, బీపీసీ ప్రథమ సంవత్సరంలో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని వరంగల్, కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గిరిజన విద్యార్థులు తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో సంబంధిత ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఈనెల 26తేదీ లోపు కలిసి అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు.

భర్తపై కోపంతో రైలెక్కిన మహిళ..

- రెండు గంటల్లో పట్టుకున్న పోలీసులు
- కుటుంబ సభ్యులకు అప్పగింత

స్టేషన్‌ఘన్‌పూర్: దంపతుల మధ్య ఏ విషయంలో గొడవ జరిగిందో తెలియదు కాని భర్తపై కోపంతో ఓ మహిళ లెటర్ రాసి ఇంటి నుంచి బయలుదేరింది. నరాసరి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుని రైలు ఎక్కింది. రైలులో సహ ప్రయాణికుడి ఫోన్ నుంచి భర్తకు ఫోన్ చేసి 'నేను వెళ్లిపోతున్నా.. నా గురించి వెతకొద్దు' అని చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన భర్త వెంటనే.. జీఆర్‌పీ కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించారు. దీనిపై రైల్వే, సివిల్ పోలీసులు తక్షణం స్పందించారు. కేవలం రెండు గంటల్లోపే సదరు మహిళను పట్టుకుని కుటుంబీకులకు అప్పగించారు. కాజీపేట జీఆర్‌పీ ఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన మహిళకు భర్తతో గొడవ జరిగింది. వారికి వివాహం జరిగి కేవలం మూడు నెలలే అవుతోంది. ఈ క్రమంలో భర్తపై కోపంతో సదరు మహిళ సోమవారం 'నేను ఇంటి నుంచి వెళ్లిపోతున్నా' అని లెటర్ రాసి సికింద్రాబాద్‌కు వచ్చి సికింద్రాబాద్–గుంటూరు (గోల్కొండ) ఎక్స్‌ప్రెస్ ఎక్కి డీ–3 కోచ్‌లో కూర్చుంది. సహ ప్రయాణికుడి ఫోన్ నుంచి భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో ఆమె భర్త వెంటనే జీఆర్‌పీ కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించగా జీఆర్ పోలీసులు జనగామ వద్ద గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వెతికారు. అయితే ఆమె ఆచూకీ లభించలేదు. వారు వెంటనే స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్, ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్, కాజీపేట జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైలు దిగి స్టేషన్ బయటకు వచ్చిన సదరు మహిళను ఘన్‌పూర్ సివిల్, కాజీపేట, జనగామ జీఆర్ పోలీసులు గుర్తించి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కాళేశ్వరం పుష్కరఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి


కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

- మేడిగడ్డకు 9.54,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నారం బరాజ్‌కు 19.600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రాణహిత ఉగ్రరూపం..

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలిసి భీకరంగా ప్రవహిస్తోంది. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్‌పై నుంచి వరద నీరు 12.5 మీటర్ల ఎత్తులో దిగువకు తరలిపోతుంది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ వరద ఉధృతి భారీగా పెరగడంతో మేడిగడ్డ బరాజ్ వద్ద 9,54,310 క్యూసెక్కులు తరలి వస్తుంది. బరాజ్‌లో మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు తరలిస్తున్నారు. అన్నారం(సరస్వతి)బరాజ్‌కు ఇన్‌ఫ్లో 19,600 క్యూసెక్కుల తరలిరాగా, వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువ కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

23.2 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం


నిండుకుండలా పాకాల సరస్సు

ఖానాపురం: మండలంలోని పాకాల సరస్సు నీటిమట్టం సోమవారం సాయంత్రం నాటికి 23.2 ఫీట్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా మరో 1. 10 ఫీట్ల నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పంటలకు పూర్తి స్థాయిలో సరిపోనుంది. మరో 5.3 ఫీట్ల నీరు చేరితే మత్తడి పోస్తుంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో సరస్సులో నీటి మట్టం పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు పాకాల నీటి మట్టం, కట్టను సోమవారం పరిశీలించారు. మత్స్యకారులతోపాటు ఇతరులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు.

అప్రమత్తతే ఆత్మరక్షణ

- అధికారులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఏజెన్సీలో పర్యటన


వరద ముంపు ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క


వాజేడు: గోదావరి వరదను పరిశీలిస్తున్న మంత్రి

ఏటూరునాగారం/వాజేడు: వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమను తాము రక్షించుకోవాలని, అధికారులు, వరద బాధితులు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో పర్యటించారు. ముందు ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి నది, సామాజిక ఆస్పత్రిని పరిశీలించారు. సామాజిక ఆస్పత్రిలోని ఐసీయూ, ఇంటెన్సికేర్ యూనిట్‌లో వరద ముంపు ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది గర్భిణులతో మాట్లాడారు. వాజేడు, వెంకటాపురం(కె) తదితర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో సేవలు ఎలా అందుతున్నాయని, వైద్యులు నుంచి ఎలాంటి స్పందన వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోదావరి, వాగుల వల్ల ఇబ్బంది ఉన్న గ్రామాల్లోకి అధికారులు ఇప్పటి వరకు వెళ్లి అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. వరద పెరిగితే వెంటనే తరలించడానికి జిల్లాలో 135 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి రెండు కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండడంతో ఆ ప్రవాహాన్ని పరిశీలించారు.

బొగతను సదర్శించిన మంత్రి సీతక్క..

వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతాన్ని అధికారులతో కలిసి మంత్రి సీతక్క సందర్శించారు. జలపాతం వద్ద ఇందిరా క్రాంతి మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం ఆమె అధికారులతో కలిసి జలపాతం చూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ క్యాంటీన్‌లో తింటే అమ్మ గుర్తుకువస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ శబరీష్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, ఓఎస్‌డీ మహేష్ బాబా సాహేబ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

- 15 మందికి గాయాలు
- సముద్రాల గ్రామంలో ఘటన


ఘన్‌పూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్: వరి నాట్లు వేయడానికి కూలీలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో 15 మంది గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సముద్రాలకు చెందిన నేరెళ్ల రాజు గ్రామ శివారులోని తన పొలంలో వరి నాటు వేసేందుకు తన ట్రాక్టర్‌లో 25 మంది కూలీలు, 7 యూరియా బస్తాలతో వెళ్తున్నాడు. పొలం వద్దకు చేరుకున్న తర్వాత ట్రాక్టర్ ట్రాలీ ఒకవైపునకు ఒరిగి బోల్తా పడింది. ఈ ఘటనలో కూలీలు కిందపడగా వారిపై బస్తాలు పడడంతో 15 మంది గాయపడ్డారు. అందులో కత్తుల వెంకటమ్మ, ఎలబోయిన అరుణ, రుద్రపు రజిత, కన్నెబోయిన యశోద తీవ్రంగా, కట్ల లక్ష్మి, ఎలబోయిన ప్రమీల, కట్ల దివ్య, మానస, బత్తుల హైమ, నేరెళ్ల హైమ, బత్తుల రజిత, రమ, అనూష స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై నాగరాజు ఆస్పత్రికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ట్రాక్టర్ ట్రాలీ బురద పొలంలో బోల్తా పడడంతో అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారని, అదే మరోచోటు అయితే పరిస్థితి తీవ్రంగా ఉండేదని బాధితులు తెలిపారు.

ఏటీఎం దొంగల పట్టివేత

వరంగల్ క్రైం: ఇతర రాష్ట్రాలతో పాటు నగరంలోని ఏటీఎంల్లో చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకున్నట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పతేపూర్‌కు చెందిన శుభం, అతడి స్నేహితురాలు ప్రియాంకకు శివవీర్‌సింగ్, అనీష్‌సింగ్, సత్యవీర్, సీసీఎల్, ప్రియాంకసింగ్ పరిచయమయ్యారు. వీరంతా బట్టల షాపుల్లో పనిచేస్తున్నారు. అయితే జీతం సరిపోకపోవడంతో శుభం సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా మిగతా వారితో ఏటీఎంల్లో చోరీకి పాల్పడుదామని పేర్కొన్నాడు. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాగపూర్, ప్రాంతాలకు తీసుకెళ్లి ఏటీఎంలు ఎలా చోరీ చేయాలో చూపించాడు. దీంతో వీరు కూడా చోరీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా హనుమకొండ నయీంనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.వెయ్యి, ఎంజీఎం పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.10వేలు, హనుమకొండ లోకల్ బస్ డిపో దారిలో ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.6500, హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ ప్రాంతంలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.2వేలు, నయీంనగర్ మెయిన్‌రోడ్డులో కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.వెయ్యి, హనుమకొండ బస్టాండ్ దారిలోని కెనరా బ్యాంకు ఏటీఎంలో రూ.5 వేలు చోరీ చేశారు. సోమవారం ఉదయం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎం పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని పట్టుకుని వారి నుంచి డబ్బు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన వారిలో శివవీర్‌సింగ్, అనీష్‌సింగ్, సీసీఎల్ ఉన్నారు. సత్యవీర్, ప్రియాంకసింగ్, శుభం, ప్రియాంక పరారీలో ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

28 నుంచి దూరవిద్య పీజీ తరగతులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల తరగతులు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రాంచంద్రం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం ప్రథమ సెమిస్టర్ విద్యార్థులకు, ఇయర్ వైజ్ స్కీంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఏ (పొలిటికల్ సైన్స్), ఇంగ్లిష్, సోషియాలజీ, ఎంకాం తరగతులు దూరవిద్య కేంద్రంలోనే ఉంటాయని వెల్లడించారు.

తెలంగాణ అంటేనే దాశరథి..


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్



మాట్లాడుతున్న సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్

- జైలులో కూడా ఉద్యమాలు చేసేవారు
- దాశరథి శతజయంతి ఉత్సవాల్లో వక్తలు

మహబూబాబాద్/చిన్నగూడూరు: తెలంగాణ అంటేనే దాశరథి.. దాశరథి అంటేనే తెలంగాణ అని పలువురు వక్తలు కొనియాడారు. దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో భాగంగా సోమవారం దాశరథి పుట్టిన గ్రామం చిన్నగూడూరు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నగూడూరు, మహబూబాబాద్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన మహబూబాబాద్‌లోని ఎస్పీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దాశరథి తన ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమించారన్నారు. జైలులో కూడా ఉద్యమాలు చేసిన వ్యక్తి దాశరథి అన్నారు. దాశరథి జీవిత చరిత్రను భావితరాలకు తెలపాలన్నారు. చిన్నగూడూరుకు దాశరథి చిన్నగూడూరు అని నామకరణం చేయాలని కోరారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాట్లాడుతూ అక్షరమే అగ్నిధారగా, పద్యమే పదునైన ఆయుధంగా మలిచి ప్రజలను మేల్కొలిపిన మహనీయుడు దాశరథి అన్నారు. దాశరథి సత్య, నిత్య అన్వేషి అన్నారు. ప్రజల కోసం పరితపించిన గొప్ప వ్యక్తి దాశరథి అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెలుగు సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ దాశరథి పద్యాలను గుర్తుపెట్టుకుని ఆయనను స్మరించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ దాశరథి గురించి భావితరాలకు తెలిసేలా పలు కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, టీఎన్జీఓఎస్ పూర్వ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, గునిగంటి కమలాకర్, వెంకటేశ్వర్లు, అడ్డగోడ రాజేశ్, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణుమాధవ్, జె. వెంకన్న, శంకర్ గౌడ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి



మాట్లాడుతున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: క్రమశిక్షణ, కఠోర శ్రమతోనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎస్సార్ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. బీటెక్, బీబీఎం, బీఎస్సీ(అగ్రికల్చర్) మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యూవర్సిటీల్లో అధునాతన సదుపాయాలు ఉన్నాయన్నారు. ఉత్తమ కరిక్యులం, పరిశ్రమ అవసరాలను అందులో పొందపర్చామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో జాతీయ స్థాయి యూనివర్సిటీకి 98వ ర్యాంకు దక్కిందన్నారు. నాణ్యమైన విద్యతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. ఎస్సార్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ విదేశీ వర్సిటీలతో తమ యూనివర్సిటీ ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. దీని ద్వారా కరిక్యులం, డిజైనింగ్, విదేశాల్లో ఉన్నత విద్యకు అనుకూలంగా ఉంటోందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డీన్ డాక్టర్ మహేశ్, డాక్టర్ విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ఆటో ఢీకొని యువకుడి దుర్మరణం

- మహబూబాబాద్‌లో ఘటన


శంకర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆటో ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. కేసముద్రం మండలం మర్రితండా జీపీ పరిధి చెరువుముందు తండాకు చెందిన వాంకుడోత్ బుజ్జి, భిక్షపతి దంపతుల కుమారుడు శంకర్ (28) రైల్వే విచారణ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో తన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆదివారం సాయంత్రం నర్సంపేట బైపాస్ జంక్షన్ ప్రాంతంలో ఆటో రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్రగాయాలుకావడంతో స్థానికులు గమనించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ చింతల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులు అప్పగించారు.

కొత్తపల్లిలో వ్యక్తి..


రమేశ్(ఫైల్)


ఎల్కతుర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో చోటు చేసుకుంది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌కు చెందిన చల్లూరి రమేశ్(50) హసన్‌పర్తి మండలం ఎస్సార్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి శివారులో ఎల్కతుర్తి, ముల్కనూరు ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


లక్ష్మి(ఫైల్)

కురవి: విద్యుదాఘాతంతో ఓ మహిళా రైతు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని నేరడలో జరిగింది. కురవి ఎస్సై బైరు గోపి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెల్లగొల్ల లక్ష్మి(50) తన సోదరుడు నూకల వెంకట్రాంనర్సయ్యకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తోంది. ఈ క్రమంలో పొలం వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేయబోయింది. విద్యుత్ కనెక్షన్‌కు ఉన్న తీగలు బయటకు ఉన్న విషయం గమనించలేదు. ఆన్‌చేసే క్రమంలో తీగలు తగిలి షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్య, కుమారుడు పృథ్వీ, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు. కాగా, లక్ష్మి మృతితో నేరడలో విషాదం అలుముకుంది.

మామ అంత్యక్రియలకు వెళ్లి అల్లుడు..


శేఖర్(ఫైల్)

కాళేశ్వరం: మామ అంత్యక్రియలకు వెళ్లిన అల్లుడు.. చెరువులో నీటి మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో చోటుచేసుకుంది. మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బింగి శేఖర్(28) మామ కొమరి లాలయ్య మృతి చెందాడు. అతడి దహన సంస్కారం నిర్వహించిన అనంతరం చెరువులో స్నానం చేస్తుండగా శేఖర్ నీటి మునిగి మృతి చెందాడు. స్థానికులు చూసి కేకలు వేయడంతో కుటుంబీకులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భార్యను పరీక్షకు తీసుకెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం
- తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్న భార్య
- దాట్లలో విషాదఛాయలు


యాకన్న (ఫైల్)


తండ్రి అంతిమయాత్రలో ఏం జరుగుతుందో తెలియక చూస్తున్న చిన్నారులు

దంతాలపల్లి: పరీక్ష రాయడానికి ఆ దంపతులు సంతోషంగా బయలుదేరారు. కానీ మృత్యువు మాటు వేసి కాటు వేసింది. కారు రూపంలో ఆ జంటను విడదీసింది. కారు.. ఆటోను ఢీకొన్న ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన జటంగి యాకన్న(35) 15 సంవత్సరాలు వీఆర్‌ఏగా విధులు నిర్వహించారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేయడంతో యాకన్న మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో యాకన్న భార్య గౌతమికి సోమవారం హైదరాబాద్‌లో డీఎస్సీ పరీక్ష ఉంది. అయితే దాట్ల నుంచి వెళ్తే పరీక్షకు సమయానికి చేరుకోలేమని భావించి ఆదివారం తమ ఇద్దరు కూతుళ్లు హరిషి, ఆద్యను తీసుకుని ఖమ్మంలో ఉంటున్న తన అత్తగారి ఇంటికి చేరుకున్నారు. పిల్లలను అత్తగారి ఇంటివద్దే ఉంచి పరీక్ష రాసేందుకు దంపతులు తెల్లవారుజామున బైక్‌పై రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు.. బైక్‌ను ఢీకొనడంతో యాకన్న అక్కడికక్కడే మృతి చెందగా గౌతమికి తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్.. యాకన్న మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. యాకన్న మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది. తమ తండ్రి మృతి చెందాడని, తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతుందనే విషయం తెలియని ఆ చిన్నారులు తమ తండ్రి నిద్ర పోయాడని అనడంతో బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యాకన్న మృతిపై రెవెన్యూ శాఖ సంతాపం తెలిపారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- హాజరు కానున్న 250 మంది క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ పింగిళి రమేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న చాంపియన్‌షిప్‌కు వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. 24న జరిగే పోటీల ప్రారంభోత్సవానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి నందగోపాల్, విద్యాదర్ హాజరవుతున్నట్లు తెలిపారు. 26న సాయంత్రం ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, విశిష్ట అతిథిగా క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి హాజరై విజేతలకు పతకాలు అందజేస్తారని తెలిపారు.